మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## తహసీల్దార్‌కు సమ్మె నోటీసు అందజేత

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలకు చేసిన హామీలను అమలుచేయాలని నారాయణఖేడ్ తాలుకా అధ్యక్షురాలు నాగేశ్వరి, కార్యదర్శి వినయ కుమారి, సిఐటియు డివిజన్ కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం కంగ్టిలో తహసీల్దార్ విద్యాసాగర్‌కు సమ్మె నోటీసు అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రూ. 26 వేల కనీస వేతనం అందించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐలను కల్పించడం లేదని విచారం వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందిన టీచర్‌కు 10 లక్షలు,ఆయలకు 5 లక్షల రూపాయల చొప్పున అందచేయాలని, టీచర్‌కు 1 లక్ష, ఆయకు 50వేలని ప్రకటించిన ప్రభుత్వం తన ప్రకటనను వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని, లేకుంటే ఈ నెల 11వ తారీఖు నుంచి అంగన్‌వాడి కేంద్రాలకు తాళం వేసి పూర్తి స్థాయిలో సమ్మెలో పాల్గొనాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు అనిత, సుశీల, లక్ష్మి, సువర్ణ, ఆశ తాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

**-సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింలు**

**కంది, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు ఎం.నర్సింలు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించిన సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై భారాలు మోపుతూ కార్పొరేటర్లకు కొమ్ము కాస్తున్నారని విరుచుకుపడ్డారు. పెద్దలకు ప్రభుత్వ ఆస్తులకు కూడబెడుతూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. పెద్దలు ఎకరాలకు ఎకరాలు కబ్జాచేసుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వాలు పేదలు ఇళ్లనిర్మాణం కోసం 100 గజాలు కావాలంటే కేసులు నమోదు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎన్ శ్రీనివాస్, నాయకులు శేఖర్, సిహెచ్ నరసింహులు, సుజాత, సువర్ణ, నసీమా, సాబేర్, రత్నయ్య, నర్సింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజర్షిషా

## ఉపాధ్యాయుడి స్థానం మహోన్నతమైంది

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**మెదక్ అర్బన్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** ప్రతి మనిషి జీవితంలో ఉపాధ్యాయుడు ఉన్నాడని, వారు చూపిన దారిలో విద్యార్థులను పయనింపచేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టరేట్ ఆడిటోరియంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషాతో పాటు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఉపాధ్యాయులకు దైవంతో సమానమైన స్థానాన్ని ఇచ్చారన్నారు. భారత మొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'వార్త ప్రభావం'

## కుంగుతున్న ఎర్ర చెరువు కట్ట...

**పరిశీలించిన తహసీల్దార్ గంగాభవాని, అధికారులు**



ఎర్ర చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

**గుమ్మడిదల, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎర్ర చెరువు భారీ వర్షాలతో నిండుకుండలా ఉంది. ఈ మధ్య కాలంలోనే అధికారులు చెరువు కట్టను మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. 'వార్త'లో ప్రచురితమైన 'కుంగుతున్న ఎర్రచెరువు' వార్తపై తహసీల్దార్ గంగాభవాని స్పందించి ఇరిగేషన్ అధికారులు, సర్పంచి చిమ్ముల నర్సింహారెడ్డితో కలిసి కట్టను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెండు రోజుల్లో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేసి శాశ్వత పరిష్కారం మరమ్మతు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, గుమ్మడిదల గ్రామ పంచాయతీ కార్యదర్శి రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయం ఎదుట మంజీరా పరవళ్లు



ఆలయం ముందు నుంచి పరవళ్లు తొక్కుతున్న మంజీరా

**పాపన్నపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవానిమాత ఆలయం ముందు మంగళవారం ఉదయంనుంచి మంజీరా నది పరవళ్లు తొక్కుతోంది. ఇటీవల కురిసిన బారీ వర్షాలు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీరు మంజీరా నదిలోకి చేరుకోవడంతో మంజీరా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వనదుర్గా ప్రాజెక్టు పెద్ద ఎత్తున పొంగిపొర్లుతోంది. మంగళవారం తెల్లవారు జాము నుంచి ఆలయ ద్వారాలను అర్చకులు మూసేశారు. అమయ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని రాజగోపురంలోనే దర్శించుకుంటున్నారు. పరవళ్లు తొక్కుతున్న మంజీరానది వైపు ప్రజలు వెళ్లకూడదని ఎస్ఐ మహిపాల్ రెడ్డి ప్రజలకు సూచించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి 11వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. వరద ఉధృతి తగ్గాక ఏడుపాయల ఆలయాన్ని పునప్రారంభిస్తామని ఇఒ సార శ్రీనివాస్ పేర్కొన్నారు.

## 18 ఏళ్లు నిండినవారిని ఓటరుగా నమోదు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

ఓటరు జాబితలోని 80 ఏళ్లు నిండిన వృద్ధుల వివాలను నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం గ్రామీణాభివృద్ధి, సెర్ప్, శ్రీనిధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటురుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. మహిళ సంఘాలతో ఓటరు నమోదులో భాగంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో సెర్ప్ కార్యక్రలాపాలు వేగంగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలో అశించిన మేరకు పనుల్లో పురోగతి లేనందున డిపిఎం ఇతర అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో సెర్ప్ కార్యకలాపాలు స్వయం సహాయక మహిళా సంఘాల జీవనోపాధిలో మార్పు తీసుకురావాలన్నారు. అధికారులు నిర్దేశించిన లక్షాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. మహిళల జీవనోపాధిలో భాగంగా మహిళలు కొత్త అలోచనలకు అనుగణంగా అదాయం వచ్చే వనరులను ఎంపిక చేసుకోవాలన్నారు. బ్యాంకు లీ ంకేజీ, పిఎంఎస్‌ఎంఈ తదితర విషయాల పట్ల అధికారులు ఎక్కువగా పోకస్ పెట్టాలన్నారు. మండల కేంద్రాల్లో పింఛన్లకు సంబంధించిన అప్లికేషన్ త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో డిఅర్‌డిఎ పీడీ రమేష్, అడిషనల్ డిఅర్‌డిఎ పీడీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గరీమా అగర్వాల్

# భారీ వర్షాలకు పొంగుతున్న హల్దీ ప్రాజెక్టు

**వెల్దుర్తి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:**

మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షానికి హల్దీ ప్రాజెక్టు, చెక్‌డ్యాంలు, చెరువులు, వాగుల్లోకి భారీగా వరద నీరు చేరడంతో నిండు కుండలా జలకళను సంతరించుకొని అలుగులు పారుతున్నాయి. సోమవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వెల్దుర్తిలోని పలు కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరాయి. అలాగే రోడ్లపైకి నీరు చేరడంతో ప్రజలు, ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అలాగే కాలువల్లోకి నీరు భారీగా రావడంతో ఒక్కసారిగా నీళ్లు వెళ్ల లేని పరిస్థితుల్లో ఇళ్లలోకి, రోడ్లపైకి నీళ్లు చేరాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉధృతంగా అలుగు పారుతున్న దృశ్యం

**రామాంతాపూర్‌లో కూలిన గైడ్ వాల్..**

మాసాయిపేట మండలంలోని రామాంతాపూర్ తండాకు వెళ్లే మార్గంలో రైల్వే అండర్‌బ్రిడ్జిని ఇటీవల నూతనంగా నిర్మించారు. కాగా భారీవర్షానికి అండర్ బ్రిడ్జిలో నీరు భారీగా చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా రైల్వే అధికారులు రోడ్డు ప్రక్కన గైడ్ వాల్‌ను నిర్మించారు. అట్టి గైడ్ వాల్ భారీ వర్షానికి కూలిపోయింది. దీంతో స్థానిక సర్పంచి గోపినాయక్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డారం నుండి రామాంతాపూర్ తండాకు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి గుండా చాలా మంది ప్రయాణిస్తుంటారని, నాణ్యత లేకుండా గైడ్ వాల్ నిర్మించడం వల్ల వర్షానికి కూలిందని, సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతతో కూడిన గైడ్ వాల్‌ను నిర్మించాలన్నారు. అలాగే అచ్చంపేటలోని బతుకమ్మ కుంటకు గండి పడి నీరు వృధాగా పోతుండటంతో గ్రామస్థులు పూడ్చే ప్రయత్నం చేశారు. భారీ వర్షం కురవడంతో ఉమ్మడి మండల వ్యాప్తంగా రోడ్లన్నీ జలమయం అయ్యాయి.




మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవ్‌కుమార్

## గందరగోళంగా సర్వసభ్య సమావేశం

**-బిల్లులు రావడం లేదని ఎంపిడివోను నిలదీసిన సభ్యులు**

**అక్కన్నపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం గందరగోళంగా సాగింది. ఈ సందర్భంగి నిర్వహించిన సమావేశానికి ఎంపిపి మాలోతు లక్ష్మి భీలునాయక్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులు చేసిన అభివృద్ధి పనుల భిల్లులు రావడంలేదని ఎంపిడివొ సత్యపాల్‌రెడ్డిని నిలదీశారు. కేశనాయక్‌తండా సర్పంచ్ రవిందర్ మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలిసినందుకు తాము సిగ్గుపడుతున్నామని, కనీసం బిల్లులు రాక సిబ్బందికి జీతాలు చెల్లించ లేక తల ఎత్తుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త గ్రామం పంచాయతీలు మెయింటెన్ చేయడమే ఇబ్బంది కరంగా మారిందటే దీనికి తోడు ట్రాక్టర్ ఈఎంఐలు కట్టడం ఎలాకట్టాలని ప్రశ్నించారు. కుందన్‌వానిపల్లి సర్పంచ్ అన్నాడి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గ్రామసభ పెట్టాలంటే భయమేస్తుందని, వందలాది మంది ప్రజలు, ఫించన్లు, రేషన్‌కార్డులు ఇతర సమస్యలపై తమను నిలదీస్తున్నారన్నారు. అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పసి పిల్లలకు అందించే మురుకులు, క్రీడా సామాగ్రి రావడం లేదని సిడిపివొ జయశ్రీని నిలదీయగా హైదరాబాద్ నుండి మూడు నెలల నుండి మురుకులు రావడం లేదని ఈ నెల నుండి సమస్య ఉండదని సమాదానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపిడివొ సత్యపాల్‌రెడ్డి, జడ్పిటిసి భూక్య మంగశ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లతో పాటు అక్కన్నపేట ఎంపిటిసి పెసరు సాంబరాజుతో పాటు ఆయా గ్రామల ఎంపిటిసిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా ముగిసేలా చర్యలు తీసుకోవాలి

**అదనపు ఎస్పీ అశోక్**




సరిహద్దు జిల్లా పోలీసు అధికారులతో అదనపు ఎస్పి అశోక్

**జహీరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ అశోక్ సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలోని మహీంద్ర ఆండ్ మహీంద్రా ట్రైనింగ్ సెంటర్‌లో అంతర్రాష్ట్ర సరిహద్దు పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సమావేశంలో బీదర్ ఎస్పీ శివాస్తురాజ్పుత్, తెలంగాణ, కర్ణాటక పోలీసులు, రెవిన్యూ, ఎక్సైజ్ అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా అశోక్ మాట్లాడుతూ ఎన్నికలవేళ ఇరురాష్ట్రాల పోలీసు అధికారులతో ఎప్పటికి అప్పుడు సమన్వయం చేసుకుని ఉండాలని, మద్యం స్మగ్లర్లపై నిఘా పెంచాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎన్నికలు సజావుగా ముగసేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి రఘు, ఆర్‌డిఓ పి వెంకట్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ రాధికారెడ్డి, పట్టణ సిఐ బి రాజు, రూరల్ సిఐ నోముల వెంకటేశ్, జహీరాబాద్ డివిజన్‌లోని ఆయా పోలీసు ఠాణాల ఎస్ఐలు, చించోలి, చిడుగుప్ప, బీదర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన రాధాకృష్ణన్

**పాపన్నపేట, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** ఉపాధ్యాయ వృత్తికే సర్వేపల్లి రాధాకృష్ణన్ వన్నె తెచ్చారని పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా సర్వేపల్లి చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్బంగా విద్యార్థులక ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఓట్లు మావి సీట్లు మీవా

**-చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు అమలుచేయాలి**
**-స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు ప్రాధాన్యత కల్పించాలి**
**-రౌండ్ టేబుల్ సమావేశంలో బిసి సంఘాల నాయకులు**

గజ్వేల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త): చట్టసభల్లో బిసిలకు ప్రాధాన్యత కల్పించాలని బిసి కులాల ఐక్య వేదిక నాయకులు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కామల్ల ఐలయ్య, మాజీ జెడ్పిటిసిలు సింగం సత్తయ్య, గుంటుకు మల్లేశం, గుంటుకు శ్రీనివాస్, వర్గల్ జెడ్పిటిసి బాలుయాదవ్‌లు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్‌లో బిసి కులాల ఐక్య వేదిక రౌండ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిలు అధిక శాతం ఉన్నారని, అన్ని రంగాలలో బిసిలకు అన్యాయం జరుగుతుందని వారు మండిపడ్డారు. ఓట్లు బిసిలవి, సీట్లు అగ్రవర్ణాలవి అని, అగ్రవర్ణాలకు తొత్తుగా ఉండాల్సిన అవసరంలేదని, బిసిలు అంతా ఐక్యమత్యమై స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు ప్రాధాన్యత ఇచ్చేలా పోరాటం చేయాలన్నారు. అగ్రవర్ణాలు రాజ్యమేలుతున్నారని, బిసిలను అట్టడుగున నెట్టేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో బిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, పార్టీలకతీతంగా బిసిలు అంతా ఐక్యమత్యమై రాజ్యాధికారం దిశగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. అధికార పార్టీలో బిసిలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని, ఎన్నికల ముందే బిసిలు గుర్తుకొస్తున్నారని, తర్వాత బిసిలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో పార్టీలకు అతీతంగా బిసి గర్జనను భారీఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో నిర్వహించబోయే బిసి గర్జనకు నియోజకవర్గంలోని బిసి కులాలకు సంబంధించిన వారు పెద్దఎత్తున తరలిరావాలని ఈ సందర్భంగా సూచించారు. అలాగే నియోజకవర్గంలోని 7 మండలాల్లో బిసి కమిటీలు పూర్తి దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. అంతకు ముందు దివంగత గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొద్ది రోజుల్లో పట్టణంలో జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బిసి కులాల ఐక్యవేదిక సభ్యులు నర్సింగరావు, జగదేవ్‌పూర్ మండల బిసి ఐక్యవేదిక కన్వీనర్ బలరాం ముదిరాజ్, నర్సింలు, రాంచంద్రాచారి, గడియారం వెంకట్‌చారి, అరునోజి లక్ష్మినర్సింహ్మాచారి, కన్నాయాదవ్, యాదగిరి, గాడిపల్లి అనూఫ్, రొట్టెల శ్రీనివాస్, మురళి, హైదర్ ఎక్బాల్, రమేష్‌గౌడ్, లింగంగౌడ్, మర్కంటి పోచయ్య, పసుల లింగం, గంగిశెట్టి రాజు, చింత శ్రీనివాస్, కొట్టాల శ్రీను, శ్రీరాం నర్సింలు, తలకొక్కుల దుర్గాప్రసాద్, పులి బాల్‌చంద్రం, సద్గుణ రవీందర్, మంగళి సుధాకర్, సుంకరి బాల్‌కుమార్, జంగం రమేష్, శ్రీరాం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ఐక్యతను చూపుతున్న బిసి సంఘాల నేతలు

# తప్పు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

**ఏడుపాయల అమ్మవారి బంగారం విషయంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి**

**మెదక్ రూరల్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:**

శనివారం రాత్రి ఏడుపాయల ఈవో అమ్మవారి నగలను తన ఇంటికి తీసుకొచ్చిన విషయంపై ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి పేరు ప్రస్తావించడాన్ని ఖండిస్తూ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పు ఎవరు చేసినా తప్పే అని, ఈవో శ్రీనివాస్ రాత్రి 10:28 గంటలకు తనకు ఫోన్‌చేసి అమ్మవారి బంగారు నగలను కరిగించి మింట్‌చేసిన బంగారాన్ని హైదరాబాద్ నుండి మెదక్ తీసుకొచ్చిన ఆలయ ఈవో శ్రీనివాస్ ఆ రాత్రి ఆ సమయంలో ఫోన్ చేసి హైదరాబాద్‌లో మింట్ దగ్గర ఆలస్యం కావడం ఆ తరువాత మెదక్‌కు వచ్చేసరికి బ్యాంక్ లాకర్ బంద్ ఉందని తనకు సమాచారం ఇచ్చాడని, అప్పటికే తాను పాలకమండలికి, పోలీసులకు సమాచారం ఇవ్వమని తెలిపానని, అంతేతప్ప అంతకుమించి అమ్మవారి బంగారానికి తనకు, ఈవో శ్రీనివాస్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంపై తాను తడిబట్టలతో అమ్మవారి గుళ్లో పది రోజుల తరువాత ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని విలేకరుల సమావేశంలో తెలిపారు. అక్కడ విలేకరులు అడిగిన ప్రశ్నలకు తన పేరు చెప్పడంతో తనకు సంబంధం లేని విషయంలో తనను లాగడాన్ని గురించి తాను మానసికంగా ఇబ్బందికి గురవుతుండటం వల్లనే తాను ఈ విలేకరుల సమావేశం ఏర్పాటుచేసిన చెప్పవలసి వస్తుందని, విపక్షాలు ఏ ఆధారం లేకుండా తనపై బురద చల్లడంపై తాను ఎమ్మెల్యే భర్తనై ఉండటం వల్లే ఎమ్మెల్యే పేరు ప్రతిష్టలకు భంగం కలిగించాలనే ఉద్దేశంతోనే విపక్షాలు ఈ విషయాన్ని ఇంత పెద్దదిగా చేస్తున్నాయని దేవేందర్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఏడుపాయల అమ్మవారి ప్రాశస్త్యం గురించి తనకు తెలుసని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా అమ్మవారు తగిన శాస్తి చేస్తారని, ఈవోను ఏనాడు తాను వెనకేసుకురాలేదని, ఇప్పుడు జరిగిన తప్పునూ తాము ఒప్పుకోవడం లేదని, చట్టరీత్యా ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవలసిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో 2021లో ఈవోను ఇక్కడి నుండి బదిలీ చేసిన విషయంపై విలేకరులు అడగగా ఒకింత అసహనం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన చిన్న చిన్న తప్పులను మీడియా పెద్దగా చేసి చూపిస్తుందని, చిన్నచిన్న విషయాలు పెద్దగా చూపి భక్తుల మనోభావాలను దెబ్బతీయరాదని కోరారు. ఈవో సార శ్రీనివాస్ సరైన వ్యక్తే అయితే తునిక నల్ల పోచమ్మకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేయించిన ఐదు తులాల గొలుసు సంగతి, చాకరిమెట్ల హనుమాన్ ఆలయానికి సంబంధించి బంగారాన్ని, చెక్కుల మార్పిడి వ్యవహారం, సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం తదితర విషయాలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలుదాటవేశారు. ఏదేమైనప్పటికీ దేవాదాయ శాఖ అధికారులు విచారణ జరిపి ఈవోను సస్పెండ్ చేయాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏడుపాయల పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, పాలక మండలి సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

## ఇంకేంపల్లి వంతెన పనులు పూర్తి చేయాలి

**-డిసిసి అధ్యక్షుడు తిరుపతిరెడ్డి**

**పాపన్నపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రామతీర్థం గ్రామ శివారులో మంజీరా నదిపై మెదక్-కామారెడ్డి జిల్లాలను కలుపుతూ నిర్మిస్తున్న వంతెన అసంపూర్తి పనులను వెంటనే పూర్త చేయకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టాల్సి వస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి హెచ్చరించారు. పాపన్నపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ 2018లో నిర్మాణం పనులు చేపట్టినా ఇంతవరకు పూర్తి చేయకపోవడం రెండు జిల్లాల ప్రజలను ఇబ్బందులు పెట్టడం కాదా అని ప్రశ్నించారు. వంతెనకు కామారెడ్డి జిల్లా వైపు రోడ్డు పనులు పూర్తి కాగా మెదక్ జిల్లా వైపు పనులు అసంపూర్తిగా మిగిలిపోవడం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పనీతీరును చాటుతోందని విచారం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ బంగారం విషయంలో ఇఒ సార శ్రీనివాస్ పదేపదే ఎమ్మెల్యే భర్త పేరును ఉచ్చరిస్తూ ఉండటాన్ని గమనిస్తే దేవేందర్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు అనుమానించాల్సి వస్తుందన్నారు. ఇవోను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఆలయం నుంచి బంగారం తరలింపు ఆలయ చైర్మన్‌కు తెలియదంటే పాలకమండలి ఉండి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, పార్టీ మండల అధ్యక్షులు గోవింద్ నాయక్, జిల్లా నాయకులు నిట్టలక్షప్ప, ప్రేమ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, ఈశ్వరప్ప, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కురిసిన వర్షాలు... మురిసన అన్నదాతలు



గజగట్లపల్లిలో అలుగు పారుతున్న దామరచెరువు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పంట పొలాలకు నీరుచేరడంతో అన్నదాతల సంతోషానికి అవదులు లేవు. మంగళవారం కురిసిన వర్షానికి చెరువులు, కుంటలు నిండి, పొంగుతున్నాయి. చిన్నశంకరంపేటలోని పెద్దచెరువు మత్తడి దూకుతుంది. గజగట్లపల్లిలోని దామర చెరువు నిండి అలుగుపారుతుంది. సూరారంలోని వంద సంవత్సరాల చరిత్ర కలిగిన మర్రిచెట్టు నేలకొరిగింది.

## అధిక సాంద్రత పత్తి సాగు బాగున్నాయి

**-కేంద్ర పత్తి పరిశోధన కేంద్రం డైరెక్టర్ ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ ఎఆర్.రెడ్డి**



పత్తి పంటను పరిశీలిస్తున్న కేంద్ర పత్తి పరిశోధన డైరెక్టర్

**మర్కుక్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** అధిక సాంద్రత పత్తి సాగు బాగున్నాయని కేంద్ర పత్తి పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వైజి.ప్రసాద్, ఇసిఎఆర్ అటారి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎఆర్.రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోగల రైతువేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాములపర్తి, మర్కుక్, నర్సన్నపేట, ఎర్రవల్లి గ్రామాలలో అధిక సాంద్రత పద్దతిలో సాగుచేసిన పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్దతిలో సాగుచేసిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఎకరాకు రైతు ఖాతాలో రూ.6వేలు జమ చేస్తుందని తెలిపారు. ఈ పద్దతిలో వంగడాలు, పంటకాలం తక్కువగా ఉండడం, కాయలు, పూత తొందరగా పూసి ఒక మొక్కకు 20 నుండి 30 వరకు కాయలు కాయడంతో పాటు మొక్కలు ఏపుగా పెరగకుండా మేపిక్వాట్ క్లోరైడ్ మందును పిచికారి చేసుకోవాలని సూచించారు. డాక్టర్ రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌లు మాట్లాడుతూ ఈ పద్దతి సాగు చేస్తున్న రైతులు ఎకరాకు 25 నుండి 30 కేజీల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. సాధారణంగా హైబ్రిడ్ వంగడాలను రైతులు ఎకరానికి 4938 మొక్కలనుండి 7407 మొక్కలసంఖ్య ఉండడంవల్ల మొక్కలు బాగా పెరగడం, పంటకాలం పెరగడం, తద్వారా గులాబీ రంగు పురుగు ఉధృతి ఎక్కువ కావడం వల్ల ఆశించిన మేరకు దిగుబడి రావడంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ రవి, రాశి కంపెనీ ప్రతినిధులు నవీన్‌రావు, నూజివీడు ప్రతినిధులు నర్సింహ్మారెడ్డి, ఏఈఓలు విష్ణువర్థన్, రైతులు పాల్గొన్నారు.

## నేడు ఎర్రవల్లి టు యాదాద్రి

**మర్కుక్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** సిఎం కెసిఆర్ గజ్వేల్ నియోజకవర్గంలో లక్షకుపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించి మూడోసారి అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఎర్రవల్లి విడిసి కమిటీ సభ్యులు సర్పంచ్ భాగ్యబిక్షపతి, ఎంపిటిసి ధనలక్ష్మి కృష్ణ, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బాలరాజుల ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ బుధవారం యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి పాదయాత్రగా వెళ్ళనున్నారు. ఎర్రవల్లి నుండి సుమారు వంద మందితో నిర్వహించనున్న ఈ పాదయాత్రను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, వైస్‌ఎంపిపి బాల్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు విడిసి కమిటీ సభ్యులు తెలిపారు. పాదయాత్రగా యాదాద్రికి చేరుకొని శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## వరకట్నం కేసులో నిందితుడికి ఏడేళ్లు జైలు

**తొగుట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** వరకట్నపు మరణం కేసులో నిందితునికి 7 యేండ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురామ్ తీర్పువెల్లడించారు. సిద్దిపేట ఏసీపీ కేతినేని సురేందర్‌రెడ్డి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పల్లె పహాడ్‌కు చెందిన పోతుల బాబుకు కొండపాక మండలం మర్పడ్గకు చెందిన రజితతో 2014లో వివాహం జరిగింది. అనంతరం హైదారాబాద్‌లో నివాసముంటున్నారు. అక్కడి నుంచి దుబాయి వెళ్లిన పోతుల బాబు సంవత్సరం తిరిగి వచ్చి సిద్దిపేటలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో అదనపు కట్నం కోసం వేధించడంతో పెద్ద మనుషులు సర్దిచెప్పి రాజీకుదిర్చారు. అయినప్పటికి బాబు ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో 2017 రజిత ఇంట్లో ఉరి వేసుకొని మరణించింది. రజిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేశారు. ఏసీపీ నర్సింహ్మారెడ్డి పరిశోధన ప్రారంభించి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి నేటీ వరకు విచారణ కొనసాగగా ఇరువురి వాదనలు విన్న జిల్లా న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితునికి 7 యేండ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. విచారణ కొనసాగించిన పోలీసు అధికారులతో పాటు కోర్టు సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను సీపీ అభినందించారు.

# చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్యను మార్చితేనే గెలిపిస్తాం

**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అక్రమ ఆస్తులు ఎన్నో చూడండి**
**-ఎమ్మెల్యే కాకముందు ఎన్నిక అయ్యాక ఆస్తులేన్ని?**
**-బిఆర్ఎస్ కార్యకర్తలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే మాకొద్దు..**
**-చేవెళ్లలో బిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యం**
**-గ్రూపు రాజకీయాలు చేసిందే చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యనే..**
**-మొయినాబాద్ మండల బిఆర్ఎస్ నాయకులు ముకుమ్మడిగా డిమాండ్**


చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మొయినాబాద్ మండల బిఆర్ఎస్ నాయకులు

**చేవెళ్ళ, సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
బిఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను మార్చితేనే గెలిపిస్తామని,లేకుండా బిఆర్ఎస్ పార్టీకి నష్టం జరుగుతుందని మొయినాబాద్ మండల బిఆర్ఎస్ నాయకులు ముకుమ్మడిగా ప్రకటించారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంను మొయినాబాద్ మండల బిఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి కంజర్ల బాస్కర్, మాదవరెడ్డి,మోహన్‌గౌడ్,గోపాల్‌లతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ కార్యకర్తలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే కాలే యాదయ్య మాకొద్దంటూ, చేవెళ్ల అభ్యర్థిగా ప్రకటించిన కాలే యాదయ్యను మార్చకుంటే ఓడిపోవడంల ఖాయమన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గత పది సంవత్సరాల క్రితం అస్తులేన్ని ఇప్పుడున్న అస్తులేన్ని విచారణ చేపట్టాలన్నారు, మొయినాబాద్ మండలంలోని ప్రతి వెంచర్‌లో ప్లాట్స్,భూములున్నాయని, భూములు కోనుగోలు చేసినవారిని అధికారంను అడ్డుపెట్టుకుని బేదిరింపులకు పాల్పడ్డారన్నారు. మొయినాబాద్‌లో నిర్మించుకోవాలంటే ముడుపులను ముట్టజెప్పాల్సిందేనన్నారు. పలు అవినితి అక్రమాలకు పాల్పడిన చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తే ఓడిపోవడం ఖాయమని, పార్టీ ఓడిపోవడం తమకు ఇష్టం లేదన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సిఎం కెసిఆర్‌కు ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని, కాని కాలే యాదయ్యకు మాత్రం ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్దంగా లేరన్నారు. బిఆర్ఎస్ పార్టీ మిద ఉన్న నమ్మకంతో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కోడుకు కాలే శ్రీకాంత్‌ను మొయినాబాద్ జడ్‌పిటిసిగా గెలిపించామని, కాలే శ్రీకాంత్‌ను మొయినాబాద్ జడ్‌పిటిసిగా గెలిచిన నాటి నుండి అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అదికారంను దుర్వినియోగం చేయడంతో పాటు విపరితంగా డబ్బులు వసూలు చేసిన సంగతి మండలంలోని ప్రజలందరికి తెలుసునన్నారు.పార్టీ పదవులను పార్టీకి పనిచేసిన నాయకులకు కాకుండా డబ్బులు ఎవరు ఇస్తే వారికి పదవులను అమ్ముకున్నారని ఆరోపించారు. పార్టీకోసం నిరంతరం పాటుపడిన నాయకులను కాదని లక్షల రూపాయలను ఇచ్చిన అవకాశవాద రాజకీయ నాయకులకు భీఫాంలను అమ్ముకున్నాడన్నారు. పార్టీకి తీవ్ర నష్టం చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను చేవెళ్ల అభ్యర్థిగా పోటీలో ఉంచితే ప్రజలందరూ తీరస్కరించడంతో పాటు తాము కూడ వ్యతిరేకిస్తామన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అభ్యర్థిత్వంను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని,ముకుమ్మడిగా తామందరం ప్రచారం చేసి ఓడగోట్టడం జరుగుతుందన్నారు. సిఎం కెసిఆర్ మరోసారి పునరాలోచన చేసి చేవెళ్ల అభ్యర్థి కాలే యాదయ్యను మార్చాల్సినవసం ఉందన్నారు.అవినితి అరోపణలు ఉన్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పార్టీ తరపున పోటి చేస్తే పార్టీ పరువుపోతుందన్నారు.మొయినాబాద్ మండంలో పలు సంక్షేమ పథకాలల్లో, షాది ముభారక్, బిసి బందు, దళిత బందు,మన ఊరు మన బడి, గొర్రెల పంపిణీ వంటి పథకాల్లో పూర్తిగా అవినితి చోటు చేసుకుందన్నారు. చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్యను కాకుండా ఇంకా ఎవరినైనా బరిలోకి దింపితే విజయం సాధించడం ఖాయమన్నారు.చేవెళ్ల అభ్యర్థి కాలే యాదయ్యను మార్యకుంటే పార్టీకి తీవ్రనష్టం జరగుతుందని మొయినాబాద్ మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముకుమ్మడిగా ప్రకటించారు.

## స్థానిక నాయకులకే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

**-తాండూరులో కాంగ్రెస్ విజయాన్ని ఎవరు ఆపలేరు**
**-సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ గోపాలక్రిష్ణ**

**పెద్దేముల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**
అనుక్షణం కార్యకర్తలకు అందుబాటులో ఉంటు పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తు పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్న స్థానిక నాయకులకే కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని సీనియర్ నాయకులు, పెద్దేముల్ మాజీ ఉపసర్పంచ్ గోపాలక్రిష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గోపాలక్రిష్ణ మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ పటిష్టత కోసం పనిచేసే నాయకులకే టికెట్ ఇవ్వాలని, కేవలం ఎన్నికల వేళ డబ్బులతో పోటి చేయడానికి వచ్చె నాయకులకు టికెట్లు ఇవ్వరాదని తేల్చిచెప్పారు. టికెట్ ఎవరికి ఇవ్వాలో కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం చూసుకుంటుందని, దాని గురించి నాయకులు బెంగ పడవలసిన అవసరం లేదని అన్నారు. ఎన్నికల వేళ తాండూరు కాంగ్రెస్‌పార్టీ టికెట్ కోసం వస్తున్న ప్యారాషూట్ నాయకులకు టికెట్ ఇస్తే పార్టీ తీవ్రంగా నష్టపోయి కార్యకర్తలు నిరాశ చెందె అవకాశం ఉంటుందని అన్నారు. కర్ణాటక ఎన్నికల తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందని, తాండూరులో కాంగ్రెస్ విజయాన్ని ఎవరు ఆపలేరని అన్నారు. కాంగ్రెస్ పెద్దలు కార్యకర్తలతో చర్చించి, పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలని అన్నారు. పార్టీ పటిష్టత కోసం పనిచేయడానికి ప్రతి కార్యకర్త సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## చిన్నారులకు తొలి అక్షరాలు నేర్పేది అంగన్‌వాడీ టీచర్లే


అంగన్‌వాడీ టీచర్లను సన్మానిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

**తాండూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :**
చిన్నారులకు తొలి అక్షరాలు నేర్పేదీ అంగన్‌వాడీ టీచర్లే అని ఎస్ఎస్పీ ట్రస్ట్ నిర్వాహకులు శ్రీశైలం అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ట్రస్ట్ సభ్యులు అంగన్ వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్యార్థులకు మొదటి బడి అంగన్ వాడీ కేంద్రాలని అన్నారు. చిన్నారులకు తొలి అక్షరాలు నేర్పేదీ అంగన్‌వాడీ టీచర్లని కొనియాడారు. మరోవైపు అంగన్‌వాడీ టీచర్ విజయమాల, నాగలక్ష్మి తదితరులు మాటాడుతూ.. గత 22సంవత్సరాలుగా చిన్నారులకు ఎంతో సేవ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లను ఉపాధ్యాయ దినోత్సవం సందర్బంగా గుర్తించి సన్మానించడం చాలా సంతోషంగా ఉందని ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మా సేవలను గుర్తించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్కాకుల నిర్మల, ట్రస్ట్ సభ్యులు భాను, బాలు, నరేష్‌గౌడ్, విజయ్‌కుమార్, అల్లాపూర్ నరేష్‌గౌడ్, మనోహార్, సాయికుమార్, చావుస్, హరీష్, అంగన్ వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి మహేందర్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు వడ్ల నందు


మంత్రి మహేందర్‌రెడ్డికి పుష్ప గుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న వడ్ల నందు, ఇతర నాయకులు

**వికారాబాద్,సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** సమాచార, పౌర సంబంధాల, గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి మంగళవారం వికారాబాద్‌కు వచ్చిన సందర్బంగా బీఆర్ఎస్ నాయకులు వడ్ల నందు మంత్రి ని కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల, కౌన్సిలర్ చందర్‌నాయక్, ధారూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ జె.హన్మంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్తహర్ షరీఫ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుర్లపల్లి రమేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## శ్రీకేశవస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**కొడంగల్,సెప్టెంబర్ 5ప్రభాతవార్త :** కొడంగల్ పట్టణం బ్రహ్మణవాడలో వెలసిన శ్రీకేశవస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు వేడుకల నిర్వహకులు కె.మురారి వశిష్ట తెలిపారు.శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం కె.శ్రీహరి వశిష్ట స్వగృహం నుంచి శ్రీకేశవస్వామి ఆలయం వరకు శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు ఉంటుందన్నారు.అనంతరం ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈనెల 7న గురువారం పంచామృతాభిషేక పూజలతో పాటు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే బాలగోకులం,సాయంత్రం వేళల్లో డోలారోహణం మహోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు.అనంతరం ఆలయంలో 5 సంవత్సరాల లోపు చిన్నారులచే శ్రీకృష్ణ వేశాధారణతో బాలగోకులం పోటీలు నిర్వహించి అనంతరం 8 మంది విజేతలకు 5గ్రామల వెండి పతకాలను అందించడం జరుగుతుందన్నారు.అలాగే ఈనెల 8న శుక్రవారం స్వామివారి పల్లకి సేవ,ఊరే గింపు,పెరుగు బసంతంతో వేడుకలు ముగుస్తాయని నిర్వహకులు తెలిపారు.

# స్థానికులకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వరా ?

**-అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోరా**
**-కీసర గ్రామంలో 131 సర్వే నంబరు అటవీశాఖ భూమి కబ్జా**
**-నీవు ఏమైనా దేవుడివా జడ్పీ వైస్ చైర్మన్‌పై ఎంపిటిసి ఫైర్**
**-గృహలక్ష్మీ కింద 588 ధరఖాస్తులు**


మండల పరిషత్ కార్యాలయ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ

**కీసర,సెప్టెంబరు5,ప్రభాతవార్త:**
స్థానికులకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వకుండా నగరంలోని వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వడం ఏమిటని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసిలు నిలదీశారు.రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం మంది స్థానికులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని జిఒ తెచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని బోగారం ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి సమావేశం దృష్టికి తెచ్చారు.బోగారం గ్రామంలో డబుల్ బెడ్‌రూంలు పూర్తి కావస్తున్నా అందులో బోగారం గ్రామానికి చెందిన అర్హులైన వారికి ఎప్పుడు ఇస్తారని నిలదీశారు.మండలం మొత్తం మీద గృహలక్ష్మీ పథకానికి 835 ధరఖాస్తులు రాగా అందులో నుండి 588 మందిని ఎంపిక చేయడం జరిగిందని డిప్యూటి తహశీల్దార్ సుధాకర్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.కీసర గ్రామంలో సర్వే నంబరు 131లో అటవీశాఖ భూమిని కొందరు కబ్జా చేసి 20 ఫీట్ల రోడ్డును నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు కానీ అటవీ శాఖ అదికారులు గాని పట్టించుకోకపోవడం ఏమిటని వైస్ ఎంపిపి జలాల్‌పురం సత్తిరెడ్డి ధ్వజమెత్తారు.రెవెన్యూ అధికారులకు,అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.2020లో తయారు చేసిన గ్రామ నక్షను ఆయన సమావేశంలో చూపించారు.భావాతరాలకు ఈ భూమి ఉపయోగపడుతుందని కబ్జాకు గురి కాకుండా చూడాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.వెంటనే స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ వెంటనే అక్కడికి సర్వేయర్‌ని పంపి సర్వే చేయించి అట్టి భూమిని కాపాడుతామని చెప్పడంతో వైస్ ఎంపిపి శాంతించారు.తిమ్మాయిపల్లి గ్రామంలో ముస్లింల గ్రేవీయార్డును కూడా అక్రమార్కులు ఆక్రమిస్తున్నారని సర్పంచ్ పిడిశెట్టి పెంటయ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.యాద్గార్‌పల్లి గ్రామంలో గండి చెరువు మరమ్మత్తులకు 78 లక్షలు మంజూరు అయినా అటవీశాఖ అధికారులు పనులను మొదలు పెట్టనివ్వడం లేదని సర్పంచ్ పుట్ట రాజు ముదిరాజు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.కీసర గ్రామంలో బాలవికాస సంస్థ వారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్లను పంపిణీ చేస్తే కనీసం ప్రోటోకాల్ ప్రకారం వైస్ ఎంపిపి సత్తిరెడ్డికి, ఎంపిటిసి తటాకం నారాయణశర్మకు సర్పంచ్ నాయకపు మాధురి సమాచారం ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు.కరీంగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉ లేరని సర్పంచ్ కౌకుట్ల గోపాల్‌రెడ్డి జడ్పి వైస్ చైర్మన్ వెంకటేష్‌ని అడుగగా ఆయన విద్యావాలంటీర్లను పెట్టి విద్యను చెప్పించాలని చెప్పడంతో బోగారం ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి జడ్పి వైస్ చైర్మన్‌ని నీవు ఏమైనా దేవుడివా.. ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించమని చెబితే జీతాలు ఇచ్చి విద్యావాలంటీర్లను పెట్టి విద్యను చెప్పించమంటావా.. అనడంతో అందరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. తిమ్మాయిపల్లి గ్రామానికి అనుబంధ గ్రామమైన ధర్మారంలో విద్యుత్ షాట్‌సర్క్యూట్ వల్ల విద్యుత్ దీపాలు,బల్బులు,హైమాస్‌లైట్లు సైతం ఖాళీ పోతున్నాయని సర్పంచ్ పెంటయ్య విద్యుత్ ఏఈ మురళిక్రిష్ణకి చెప్పడంతో ఆయన వెంటనే స్పందించి అక్కడ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.వన్నిగూడ గ్రామంలో ఐరన్ కరెంటు పోల్సును తీసి కొత్తవి వేయించమంటే పట్టించుకునే నాధుడే లేరని ఎంపిటిసి వెంకట్‌రెడ్డి అన్నారు.మండలంలోని ౧ గ్రామంలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఎంపిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇట్టి గ్రామాలలో ఇండ్లు కట్టుకున్నా ఇంటి నంబర్లు ఎందుకు ఇవ్వడం లేదని ఎంపిఓ వినూత్నను జడ్పి వైస్ చైర్మన్ వెంకటేష్ అడిగారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వత్సలదేవి,ఎంపిటిసిలు జూపల్లి వెంకటేష్, ప్రమీలాదేవి,మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్‌కుమార్,పండుగ కవిత శశికాంత్, సర్పంచ్‌లు తుంగ ధర్మేందర్,పుట్ట రాజు ముదిరాజు,సుంకరి కవిత జైహింద్‌రెడ్డి,కౌకుట్ల గోపాల్‌రెడ్డి,వివిద శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
జిల్లాలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు.మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ....ఇవాళ,రేపు రెండు రోజుల పాటు భారీ వర్షం పడే అవకాశం ఉన్నందున అధికారులందరూ అప్రమత్తమై అన్ని గ్రామ పంచాయతీలు,మున్సిపాలిటీలలో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.వర్షపు నీరు నిలవకుండా మురికి కాలువల గుండా నీరు సాఫీగా ప్రవహించేలా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి అందులో ఉన్న నివాసితులను పాఠశాలలు ,గ్రామపంచాయతీ భవనాలలో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గ్రామపంచాయతీ మున్సిపాలిటీ అధికారులకు ఆదేశించారు.షార్ట్ సర్క్యూట్ వల్ల విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని వంగిన స్తంబాలను,వేలాడే విద్యుత్ తీగలు,ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ పశుసంపదకు,ప్రజల ప్రాణాలకు ఎలాంటా హాని కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు.జిల్లాలో చెరువులు పొంగి పోర్లుతున్నందున రోడ్లపై నుంచి ఉదృతంగా నీరు ప్రవహించే ప్రాంతాలలో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి పాదచారులు,వాహనదారులు దాటకుండా రెవెన్యూ,పోలీస్ సిబ్బంది 24 గంటలు కాపలాగా ఉండాలని సూచించారు.అన్ని గ్రామాలలో టామ్ టామ్ నిర్వహించి ప్రజలు తమ ఇండ్ల నుండి బయటకు రాకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ,ఆర్అండ్‌బి.ఇరిగేసన్ ,మున్సిపల్ ,విద్యుత్ శాఖలతో పాటు రెవెన్యూ పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు.ఇప్పటికే చెరువులు అన్ని నిండి ఉన్నందున భారీ వర్షాల కారణంగా చెరువు కటట్టలు తెగిగండ్లు పడే అవకాశం ఉన్నందున ముందస్తుగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకొని ప్రమాదాలను నివారించాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు.అధికారులు ఎవ్వరు కూడా సెలవులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండి అవసరమైన సహాయక చర్యలు చేపడుతూ ప్రజలు,పశువుల ప్రాణాలను కాపాడాలని అన్నారు.ప్రజలందరు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.అత్యవసర సహాయం కొరకు కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనదని 7995061192 ల్యాండ్ లైన్ 08416-235291 సంప్రదించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు,జిల్లా అధికారులు,ఆర్డివోలు,గ్రామపంచాయతీ అధికారులు,మున్సిపల్ కమిషనర్లు,ఆర్అండ్‌బి ఇరిగేషన్,పంచాయతీరాజ్,ఎలక్ట్రిసిటి శాఖ ఇంజనీర్ అధికారులు,తహసీల్దారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహించిన ఈసీనది

### - కడ్మూరువద్ద రాకపోకలుబంద్

**పూడూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :**
అల్పపీడనం ప్రహావంతో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామం వద్ద ఈసీనది (పెద్దవాగు) ఉధృతంగా ప్రవహిస్తోంది.ఎగువన మండలం పరిధిలోని మంచన్‌పల్లి,కంకల్, మరియాపూర్,మాటుగూడ,పూడుగుర్తి,కడ్మూరు,చింతల్‌పల్లి,నిజాంపేట్ మేడిపల్లి,తుర్కఎన్కెపల్లి తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు నుండి భారీగా కురిసిన వర్షానికి ఈసీనది (పెద్దవాగు)లో మంగళవారం ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగింది.దీంతో కడ్మూరు గ్రామ సమీపంనుండి ప్రవహించే ఈనది (పెద్దవాగు)పై వంతెన లేకపోవడంతో వరద ఉధృతికి ఈ ప్రాంతంగుండా ప్రయాణించే వాహనాల రాకపోకలకు,మంచన్‌పల్లి గ్రామ సమీపంలో ఇదేనదిపై నిర్మించిన బ్రిడ్జిపైనుండి నీరు ప్రవహించడంతో ఆ గ్రామానికి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది,అదేవిధంగా మండలంలోని మన్నెగూడ,పూడూరు సోమన్‌గుర్తి,రాకంచెర్ల,దేవనోనిగూడ,కెరవెళ్లి,సిరిగాయపల్లి,పెద్ద ఉమ్మెంతాల్,మేడిపల్లి కలాన్, కుత్బుల్లాపూర్ మేడికొండ,చెన్‌గోముల్,అంగడిచిట్టంపల్లి, బాకాపూర్,తదితర గ్రామాల్లో ఓ మోస్తరు నుండి భారీగా కురిసిన వర్షానికి సాకెరోనివాగు,బెండ్లవాగు, మోగిళ్లవాగు, ఒంపుఒడ్క,మామిళ్లఒడ్క తదితర వాగులు,వంకలు పొంగి పొర్లాయి.ఆయా గ్రామాల మీదుగా ప్రవహించిన వాగులు,వంకల ఇరువైపుల పంట పొలాలు నీట మునిగాయి.ఆకాశం మేఘావృతమై ఉంది.


పూడూరు మండలం మంచన్‌పల్లి బ్రిడ్జిపై నుండి ప్రవహిస్తున్న ఈసీనదీ

## అర్హులైన వారు ఓటరు నమోదు చేసుకోవాలి : తహసీల్దార్


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

**కొడంగల్,సెప్టెంబర్ 5ప్రభాతవార్త**
18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ బి.విజయ్‌కుమార్ అన్నారు.మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లేవల్ అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6,7,8 తేదిల్లో ఓటర్స్ స్పెషల్ క్యాంపింగ్ డే రోజుల్లో ఎన్ని ధరఖాస్తులు వచ్చినా అందుకు అవసరమైన ఫారాలను కార్యాలయంలో బీఎల్‌ఓల ద్వారా తీసుకోవడం జరుగుతుందన్నారు.ఇందుకుగాను అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## అదుపుతప్పి బోల్తా పడ్డ పెట్రోల్ ట్యాంకర్

**పెద్దేముల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** అదుపుతప్పి పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడ్డ సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తాండూరుకు ప్రాంతానికి చెందిన భారత్ పెట్రోలియం పెట్రోల్ ట్యాంకర్ హైద్రాబాద్ నుంచి తాండూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి దుగ్గాపూర్-మంబాపూర్ మద్యన కోటపల్లి కెనాల్ కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ట్యాంకర్‌లో ఉన్న పెట్రోల్, డిజిల్ సుమారు 12 వేల లీటర్లు నేల పాలు కావడంతో రూ. 12 లక్షల నష్టం వాట్లిలింది, అయితే ఎవరికి కూడా ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ గూటికి...

**దుబ్బాక, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట గ్రామంలో 6,7,8,9 వార్డులో దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్మేట ఏసు రెడ్డి, దుబ్బాక మున్సిపాలిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాస మధు, దుబ్బాక మండల సోషల్ మీడియా కన్వీనర్ కర్ణంపల్లి రమేష్ గౌడ్, సారథ్యంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో బిజెపి, బిఆర్ఎస్ నాయకులు సుమారుగా 100 మందికి పైగా కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సారి దుబ్బాక నియోజకవర్గంలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. ఆ తరువాత అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి అధ్వర్యంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చెబడుతుందన్ని కాంగ్రెస్ పార్టీ తోనే అభివృధి జరుగుతుందన్ని ప్రజలు విశ్వాసిస్తున్నారు. మాయా మాటలతోనే ఈ 10 సంవత్సరాల కాలం వెళ్లబోసారని ఇక నుండి ప్రజలు అభివృద్ధి వైపే మొగ్గు చుపుతూన్నారన్నరు. కాంగ్రెస్ పాలనలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు, పాల్గొన్నారు.

## గజ్వేల్ నుంచి సిఎం కెసిఆర్ హ్యాట్రిక్ విజయం తథ్యం

**వర్గల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో తీర్చిదిద్దిన సిఎం కెసిఆర్ మళ్ళీ ఇక్కడి నుండే పోటీ చేయాలని, హ్యాట్రిక్ విజయం అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు వర్గల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, ఎంపిపి లతా రమేష్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజులు పేర్కొన్నారు. మంగళవారం వర్గల్‌లో ఏర్పాటుచేసి మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 30వేల కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన సిఎం కెసిఆర్‌కు ప్రజలు అండగా నిలుస్తూ కులాలు, మతాలు, గ్రామాలు ఏకగ్రీవ తీర్మాణం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా గజ్వేల్ నుండి సిఎం కెసిఆర్‌కు ప్రజలు లక్ష మెజార్టీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండగా కెసిఆర్ మినహా ఇక్కడి నుండి ఎవరు పోటీ చేసినా ఊరుకునేదిలేదని చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నియోజకవర్గం అన్ని రంగాలలో వెనుకబడిపోగా దశాబ్ద కాలంగా త్రాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం తదితర రంగాలతో పాటు అనేక సంక్షేమ రంగానికి పెద్దపీట వేసి అడిగినన్ని నిధులు కేటాయించిన సిఎం కెసిఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. అలాగే అర్హులైన వారందరికీ దళితబంధు, బిసిబంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి తదితర పథకాలు వర్తింపజేసి ఆర్థికంగా ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కడపల బాల్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు జాలిగామ వెంకటేష్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్కంటి సంతోష వెంకటేష్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వర్గల్‌మండల బిసిసెల్ అధ్యక్షుడు మురళీగౌడ్, తుమ్మ గణేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నశంకరంపేటలోని శ్రీ సాయి విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జున్‌ను పూర్వ విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణ నేర్పించడం పాఠశాల స్థాయి నుండి కీలకమని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఆయన తెలిపారు. అనంతరం సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ మండలాధ్యక్షుడు రాజు, స్వామి, ఆకులరాజు, ఉపేందర్ తదితరులు పాల్గోన్నాం

## బాలల హక్కుల ఉద్యమం

**కొల్చారం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రమేష్ నాయక్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు దేశ వ్యాప్తంగా జరుగుతున్న కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహకారంతో కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సాక్రుబాయి మాట్లడుతూ లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలల చాకిరి నుంచి బాలలకు విముక్తి కలిగించే బాలల హక్కుల ఉద్యమం ఇదని, మెదక్ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పెడ్ టీమ్ మండల ఆర్గనైజర్ సత్యనారాయణ, రాజేందర్, కౌన్సిలర్ దయాశీల హాజరయ్యారు.

## గూడులేని అవ్వకు తోడైన బిజెపి నేత నందన్‌గౌడ్

**గజ్వేల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని 9వ వార్డులో నివాసం ఉంటున్న మాదారం బుచ్చమ్మకు గూడు లేకపోవడంతో ఈ విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర యువజన నాయకుడు నందన్‌గౌడ్ మంగళవారం ఆమెను పరామర్శించి వారం రోజుల్లో ఇంటిని నిర్మంచి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయాన ముఖ్యమంత్రి నియోజకవర్గ కేంద్రంలో ఓ వృద్ధురాలు ఇల్లు లేక ధీన స్థితిలో ఉండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మొదటిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత గజ్వేల్ నడి బొడ్డున ఏర్పాటుచేసిన బహిరంగ సభలో గజ్వేల్ పట్టణంలో ఎవరూ ఇల్లు లేకుండా ఉండవద్దనే ఉద్దేశ్యంతో 5వేల ఇండ్లు కట్టిస్తానని మాట ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రం అంతటా పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తానని హామీ ఇచ్చిన కెసిఆర్ పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని, రానున్న రోజుల్లో సిఎం కెసిఆర్‌కు ప్రజలు బుద్ది చెబుతారని హెచ్చరించారు. ఆయన వెంట బిజెపి సీనియర్ నాయకులు ఎల్కంటి సురేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

## నాచగిరిలో వైభవంగా సుదర్శన హోమం

**వర్గల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** మండలంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో సుదర్శన హోమం 16వ రోజు అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆయల వేదపండితులు, అర్చకుల మంత్రోశ్చరణల మధ్య సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా సుదర్శన హోమం ప్రారంభమైన నాటి నుండి హల్దీ వాగు పడమర వైపు పరవళ్ళు తొక్కుతుండడంతో ఆలయానికి వచ్చిన భక్తులు స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త :** బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న స్ట్రీల్ వెండర్స్ క్రమం తప్పకుండా సకాలంలో చెల్లిస్తూ ఆర్థిక అభివృద్ది చెందాలని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ అన్నారు.మంగళవారం రోజున పట్టణ కేంద్రంలో మెప్మ ఆధ్వర్యంలో పట్టణ స్వనిధి సే సమృద్ధి క్యాంప్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ అధికారులతో కలసి నిర్వహించారు.ఈ సందర్బంగా స్ట్రీల్ వెండర్స్ ఏర్పాటుకు రుణం తీసుకున్న లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రుణాలు తీసుకున్న ప్రతీ ఒక్కరు సకాలంలో చెలిస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు.రుణాలు చెల్లించేందుకు ఫోన్‌పే, గుగుల్‌పేలలో సైతం అవకాశం కల్పించినట్లు సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజరు రాజు,మెప్మ టౌన్ మిషన్ కోఆర్డినేటర్ రాజు,ఆర్‌పిలు శ్రీలత,అరుణ,శోభ,పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నీలం మధుముదిరాజ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** నీలం మధు ముదిరాజ్‌కు పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని అమీన్‌పూర్ మున్సిపాలిటీ ముదిరాజ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ముదిరాజ్ సంఘం నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఒక సీటు ఇవ్వకుండా అవమానించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పునరాలోచించుకొని నాలుగు సీట్లు అందులో పటాన్‌చెరు నియోజకవర్గంలో 2 లక్షల బీసీలు అందులో 80 వేల ముదిరాజులు ఉన్నారు కావున పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి గెలిపిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుట్టమీది చిన్న వీరేశం ముదిరాజ్, దండు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సాయికుమార్ ముదిరాజ్, పండుగ సాయి ముదిరాజ్, బంటు రమేష్, వెంకట్, ఆంజనేయులు, సంజయ్, మన్నె నరసింహరావు, బండు ప్రవీణ్, సుంకరి నర్సింలు, సమ సుధాకర్, శ్రీకాంత్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాసవీక్లబ్ నాయకులు

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని టీచర్స్ డేను మంగళవారం జిల్లా కేంద్రంలోని వైశ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 15 మంది ఉపాధ్యాయులను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి మెమోంటోలను అందించారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్ మాట్లాడుతూ సైంటిస్ట్, ఇంజనీర్, డాక్టర్, కలెక్టర్ కావాలన్నా ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉంటుందన్నారు. వాసవీక్లబ్ అధ్యక్షులు చింత రాజేంద్ర ప్రసాద్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి, రీజియన్ చైర్మన్ పుల్లూరి శివకుమార్, వాసవీయూత్ క్లబ్ అధ్యక్షులు అర్వపల్లి హరికిరణ్, క్లబ్ నాయకులు యాద శ్రీనివాస్, కృష్ణవేణి, వేణుగోపాల్, శంకర్, శ్రీనివాస్, శివ, రమేష్, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీవాణి టెక్నో స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

జిల్లా కేంద్రంలోని భారత్ నగర్‌లోని శ్రీవాణి టెక్నో స్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్.సత్యం మాట్లాడుతూ అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి విజ్ఞానాన్ని ఇచ్చేది గురువులు అన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృపాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

సమాజంలో గురువుల పాత్ర చాల కీలకమని ఎంపిపి కూర మాణిక్య రెడ్డి అన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని గోనెపల్లిలో సర్పంచ్ తాళ్లపల్లి స్వరూప ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటీ బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపైనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మ్యాన్ హోల్స్ నుంచి బయటకు వస్తున్న మురికి నీరు పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు అత్తు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణంలో వందలాది కోట్ల రూపాయాలతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పనికి రాకుండపోతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్ (అత్తు) అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్ నుంచి మురికినీరు బయటకు వస్తుందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మంజులరాజనర్సు, కమిష నర్ సంపత్‌కుమార్ పట్టించుకోవడం లేదన్నారు. రెవెన్యూ కార్యాలయం తోపాటు పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. మురికి నీరు వల్ల ప్రజలు వ్యాధులు బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. మ్యాన్ హోల్స్ నుంచి బయటకు వస్తున్న మురికి నీటిని వెంటనే క్లియర్ చేయాలన్నారు. మురికి నీరు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్‌తోపాటు దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గాయసుద్దీన్, ఫాయాజ్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ లక్కీడ్రాలో మొదటి, రెండో బహుమతి గెలుచుకున్న సిద్దిపేట జిల్లా వాసులు : డిఎం సుఖేందర్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** రాఖీపౌర్ణమి సందర్భంగా గత నెల 30,31 తేదీలలో అర్టీసి బస్సుల్లో ప్రయాణం చేసినందుకుగానూ లక్కీ డ్రాలో సిద్దిపేట జిల్లాకు చెందిన ఇద్దరు ప్రయాణీకులు బహుమతులు గెలుచుకున్నారని సిద్దిపేట డిపో మేనేజర్ వై.సుఖేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందినర బాలమణి మొదటి బహుమతి రూ.25 వేల నగదు, కొమురవెల్లికి చెందిన కల్పన రెండో బహుమతి రూ.15 వేల నగదు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈనెల 8న మహాత్మాగాంధీ బస్టాండ్ హైదారాబాద్‌లో మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ నగదు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ప్రైవేటువాహనాలను ఆశ్రయించకుండా అర్టీసిబస్సులో సుఖవంతమైన ప్రయాణంచేసి క్షేమంగా ఇంటికి చేరుకోవాలన్నారు. అర్టీసి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

## పేదింటి కల సాకారం చేశాం : ఎమ్మెల్యే

హుస్నాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త



లబ్దిదారులకు పట్టాలు అందిస్తున్న ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే

పేదింటి కలను సాకారం చేశామని ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో లక్కి డ్రా లో దక్కించుకున్న 260 మంది లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మ గౌరవంతో బతకాలని సిఎం కేసీఆర్ పేదలకు సొంతిటి కల సాకారం చేసే దిశగా సకల సౌకర్యాలతో నిర్మించిన ఇండ్లను వారికి అందిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట మేరకు పేదలకు ఇండ్లు ఇస్తున్న సిఎం కేసీఆర్‌ను ప్రజలు ఆశీర్వదించి బిఆర్ఎస్ ప్రభు త్వానికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలోమ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, హన్మకొండ జడ్పి చైర్మెన్ మారంపల్లి సుధీర్‌కుమార్, జడ్పి వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి,ఎఎంసి చైర్మెన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళినిరవి,బోజు రమాదేవి రవిందర్, పెరుక భాగ్యరెడ్డి,మిర్యాల రమేష్,వాల సుప్రజనవీన్‌రావు, బొజ్జ హరీష్, బొల్లి కల్పన శ్రీనివాస్, జనగామ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** అశ కార్యకర్తల గౌరవ వేతనం రూ.18 వేల వరకు పెంచి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ అధ్వర్యంలో అశ కార్యకర్తలు మంగళవారం మిరుదొడ్డి, భూంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు షమీంసుల్తానా, సాయి తేజస్వినిలకు వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గౌరవ వేతనం రూ.18 వేల వరకు పెంచాలన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అశ కార్యకర్తలు సుజాత, కవిత, రజిత పాల్గొన్నారు.



డాక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అశా కార్యకర్తలు

# ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్ సన్మానం

**అల్లాదుర్గం, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** అల్లాదుర్గంమండలం కాయిదంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రంజ్యానాయక్‌కు మెదక్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ చేతుల మీదుగా అందుకున్నారు. ముందుగా ఈ ఉపాధ్యాయుడికి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్య మైన విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న ఉపాధ్యాయుడికి జిల్లా ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందని కాయిదంపల్లి సర్పంచ్ బేతయ్య అన్నారు. ఈ సందర్భంగా రంజానాయక్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనందుకు సంతోషంగా ఉందన్నారు.

**పెద్దశంకరంపేట మండలం...**

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేట మండలంనుంచి ముగ్గురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. ఎస్జీటీల నుండి బద్దారం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆనంద్, స్కూల్ అసిస్టెంట్‌ల నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సుధీర్, మోడల్ పాఠశాల నుండి రాఘవేందర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక య్యారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని మంగళవారం మెదక్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ సన్మానించారు. వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు.

**వెల్దుర్తి మండలం...**

**వెల్దుర్తి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సాయిరాం (తెలగు పండిత్), జానీ (హిందీ పండిత్)లు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. కాగా మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌ల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా సాయి రాం, జానీలు ఘన సన్మానం పొందారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఉపాధ్యాయులు అక్బర్, యాదయ్య, పీడీ ప్రతాప్‌సింగ్, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు అభినందించారు.



జిల్లా కలెక్టర్‌చే జిల్లా ఉత్తమ అవార్డును అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు రంజానాయక్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షిషా,ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షిషా,ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## మల్లన్న ఆలయ చైర్మన్ అవినీతికి అడ్డులేకుండా పోతుంది

సిపిఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి



మాట్లాడుతున్న సత్తిరెడ్డి

**కొమురవెల్లి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోతుందని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. మల్లన్న అలయంలో చైర్మన్ చేస్తున్న అవినీతికి కాదేది అనర్హం అన్నట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే సమావేశానికి 1500 ప్యాకెట్ల పులిహోరను డబ్బులు చెల్లించకడా వాడుకున్నారని విషయం బయటికి పొక్కడంతో గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు జమ చేయడమే చైర్మన్ అవినీతికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన డబ్బులు పులిహోరకు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. చైర్మన్ చేసే తప్పులకు కింది స్థాయి సిబ్బందిని బలిచేసేలా ఉన్నాయన్నారు. అలయంలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల నుంచి అందినకాడికి దండుకుంటున్నారని ఆరోపించారు. దీంతో కాంట్రాక్టర్లు నాణ్యత లేకుండా పనులు చేస్తున్నారని తెలిపారు. అలయంలో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్‌తో విచారణ చేపట్టాలన్నారు. అవినీతికి పాల్పడుతున్న చైర్మన్‌కు అ పదవిలో కొనసాగే కనీస నైతికత లేదన్నారు. కార్యక్రమ ంలో సర్పంచ్ తాడూరి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి, మత్స్యకార్మిక సంఘం జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి, నాయకులు నీల బిక్షపతి, సార్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## 30 ఏళ్ల తరువాత అలుగు పారుతున్న పెద్దచెరువు



సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

**కొల్చారం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామ శివారులోని పెద్దచెరువు 30 సంవత్సరాల తరువాత అలుగు పారుతుంది. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులోకి వరద నీరు చేరి చెరువు అలుగు పోస్తుంది. చాలా కాలం తరువాత చెరువు అలుగు పారుతుండటంతో గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకొని వీక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, బాలకృష్ణరెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్‌రాజు, మల్లయ్య, గ్రామస్థులు ఉన్నారు.

## లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌నాయక్

హుస్నాబాద్,సెప్టెంబరు5,ప్రభాతవార్త : లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గుగులోతు భాస్కర్‌నాయక్ మంగళవారం ఎన్నికయినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ధరావత్ గణేష్‌నాయక్ ఒక ప్రకనటలో తెలిపారు.ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో గుగులోతు భాస్కర్ నాయక్ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నో ఉద్యమాలు చేసి జైలు జీవితం సైతం గడిపారని గుర్తు చేశారు.ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా గిరిజన సమస్యలపై పోరాటాలు నిర్వహించడంతో పాటు విద్యారంగ సమస్యలపై తాను చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు తమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దాం

సిపిఎం అర్బన్ మండల కార్యదర్శి రవికుమార్

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** నిత్యావసర వస్తువులపై కేంద్రప్రభుత్వం అధికధరల భారం మోపుతు సామాన్యుల నడ్డివిరుస్తుందని.. వెంటనే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఎం సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం సిద్దిపేట అర్బన్ మండల కమిటీ అధ్వర్యంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల నుంచి కార్పొరేట, భూస్వామ్య విధానాలను అమలు చేస్తూ పేద, కార్మిక వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. దేశంలోని బడా కార్పోరేట్ సంస్థల కొమ్ము కాస్తూ పేదలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. కార్మిక నూతన చట్టాల పేరుతో పాత చట్టాలను రద్దుచేసి కొత్తగా నాలుగు కోడ్లను ప్రవేశపెట్టి కార్మికులకు పని గంటలు పెంచి కనీస వేతనాలను అమలు చేయకుండా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరంచేస్తుందన్నారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో 14 రకాల నిత్యావర వస్తువులను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేవారని బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అవి కనకబడకుండా పోయాయని తెలిపారు. కేంద్రప్రభుత్వ విధానాలపై పోరాటాలకు సిద్దంగా కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సింగిరెడ్డి నవీన, మామిడాల కనకయ్య, కొండం సంజీవ్‌కుమార్, లక్ష్మీ, చంద్రం, రాములు పాల్గొన్నారు.

## చెరువుకు గండి.... రైతుల్లో కలవరం



దర్పల్లిలో బతుకమ్మ చెరువుకు గండి పడి వృధాగా పోతున్న నీరు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి చిన్నశంకరంపేట మండలం ధర్పల్లిలోని బతుకమ్మ చెరువుకు గండి పడి నీరు వృధాగా పోతుంది. చెరువు శిఖం భూముల్లో 60 ఎకరాలకు పైగా పంటలపు పండిస్తున్నారు. గ్రామ రైతులు, నీరు వృధాగా పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పొలాల్లోకి నీరుచేరి పంటలు పాడైపోతాయని, తీరని నష్టం వాటిల్లుతుందని వారు తెలిపారు. నీరు వృధాగాపోతే పంటలకు నీరు కావాలన్నప్పుడు నీటి కొరత ఏర్పడుతుందని, అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని చెరువు గండిని పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**శివ్వంపేట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన మియ్యాడి రాములు అకస్మాత్తుగా మరణించడం జరిగింది. ఆ కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖ సంఘ సేవకులు, మెదక్ జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, శివ్వంపేట జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త అంత్యక్రియల కోసం 5 వేల రూపాయలు, నెలకు సరిపడు నిత్యావసర సరుకులు ఇవ్వడం జరిగింది. అదే కుటుంబానికి స్థానిక సర్పంచి పత్రాల శ్రీనివాస్‌గౌడ్ బాధితులను పరామర్శించి 3 వేల రూపాలయ ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ఆర్. పద్మ వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, వార్డు సభ్యులు జ్యోతి సింహం, వంజరి కొండల్, కొవ్వూరి వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు బిచుకుంద అంజయ్య, చిన్న ఆంజనేయులు, చుక్క భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు బిసిల ఐక్యత గుర్తురాలేదా



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**గజ్వేల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** కొందరి స్వలాభం కోసం బిసిల ఐక్యత రాగం ఎత్తుకున్నారని గజ్వేల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెండె మధు, కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ర్యాగళ్ళ దుర్గయ్యలు విమర్శించారు. ఎన్నికలు రాగానే కులాలు గుర్తుకు వస్తాయి, వ్యక్తిగత రాజకీయ లబ్ధి పొందడం కోసం కొంత మంది వ్యక్తులు బిసి రాగం ఎత్తుకొని బిసిల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా పదవులు అనుభవించిన వాళ్లే ఈరోజు బిసిలతో రాజకీయ పబ్బం గడుపుతున్నారని, మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు బిసిలు ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. పదవి పోవడంతో బిసిలను తెరపైకి తీసుకువచ్చి చీల్చే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావులు మిమ్మల్ని గౌరవించి మున్సిపల్ చైర్మన్ పదవి అప్పజెప్పారని, గజ్వేల్ నియోజకవర్గంలో బిఆర్ ఎస్ పార్టీకి తిరుగులేదని తెలిసి ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. కులాల వారీగా సముచిత స్థానం కల్పించిన ఘనత సిఎం కెసిఆర్‌ది కాదా అన్నారు. పదవులు ఉన్నప్పుడు ఒక మాట, పదవులు పోతే మరోమాట మాట్లాడడం రాజకీయ నాయకుల లక్షణం కాదని, ఇకనైనా ఇలాంటి చిచ్చుపెట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. గజ్వేల్ నియోజకవర్గంలో సిఎం కెసిఆర్ తప్ప ఎవరూ అతని ముందు నిలబడే దమ్ము ధైర్యం లేదని, ప్రజల్లో సిఎం కెసిఆర్ చిరస్థాయిగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించి తీరుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు మేకల కనకయ్య, మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాత్‌పల్లి సర్పంచ్ బచ్చలి మహిపాల్, మంగోలు సర్పంచ్ కిరణ్‌చారి, బందారందర్గా సర్పంచ్ శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు తదితరులు

## తడ్కల్‌ను నూతన మండలంగా ప్రకటన

-ఎమ్మెల్యేను సన్మానించిన ప్రజాప్రతినిధులు

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కంగ్టి మండలంలోని తడ్కల్ గ్రామాన్ని నూతన మండలంగా ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు సహకరించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డిని మండల ప్రజాప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 5 మండలాలతో ఉన్న నియోజకవర్గంలో కొత్తగా 4 మండలాలు ఏర్పాటు అయ్యేలా చేయడంతో ఎమ్మెల్యే సఫలీకృతులయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు కోట లిత ఆంజనేయులు, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్కే గంగారాం, మార్కెట్ కమిటి డైరెక్టర్ దర్జీ రమేష్, ఎంపిటిసి సభ్యులు అంబాజి, శ్రీకాంత్, మండల కో-ఆప్షన్ సభ్యులు అహ్మద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు మనోహర్, సాయిలు, సంతోష్, నారాయణ, మాణిక్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, పండరినాథ్ రావు, గోవింద్‌రావు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ అంతా బిఆర్ఎస్ పార్టీదే : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** భవిష్యత్ అంతా బిఆర్ఎస్ పార్టీదే అని ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో ముందుకు సాగుతూ సంక్షేమ పథకాల అమలులో పూర్తి పారదర్శకతతో అ ందిస్తున్న ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ హ్యాట్రిక్ కాయమైందని ప్రతీ కార్యకర్త ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలు వివరించాలని సూచించారు. ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు నేడు(బుధవారం) నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం జగన్నాథపూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి సమర శంకారావం పూరించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ ఏర్పడక ముందు ఏర్పడ్డ తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు



శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

**రాయపోల్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** శాసనమండలి డిప్యూటి చైర్మన్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌ముదిరాజ్‌ను రాయపోల్ మండల ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ముదిరాజ్ సమస్యల గురించి చర్చించారు.ఆనంతరం ఎమ్మెల్సీ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముదిరాజ్‌ల సమస్యలను సిఎం కేసిఆర్ గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో రాయపోల్ మాజి సర్పంచ్ సింగరబోయిన స్వామి, తీగుళ్ల స్వామి, పాపని నరేష్, ఉప్పరి రాజు,శేరి స్వామి, మందరాజు, తీగుళ్ల కృష్ణా,గజం క్రిష్ణా,తీగుళ్ల నవీన్ ఉన్నారు

## ఉపాధ్యాయులే దేశ భవిష్యత్‌కు దిశ దశ



ఉపాధ్యాయున్ని శాలువాతో సన్మానిస్తున్న గ్రామస్థులు

**కొండపాక, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** దేశం యొక్క దశదిశను మార్చే శక్తి ఉపాధ్యాయులకు (గురువులకు) మాత్రమే ఉందని గణేష్ అన్నారు. మంగళవారం గురుపూజోత్సవం సందర్భంగా లకుదారం మధిర కొలోని వంపు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు నర్సింలును గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులను గౌరవించడం మనకు గర్వకారణం అన్నారు. దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందన్నారు. దేశం జా నవంతమైనదిగా ఉండ లంటే ఉపాధ్యాయులు విద్యార్థును తీర్చిదిదాలని కోరారు. కార్యక్రమంలో తోడేటి శ్రీనివాస్, తోడేటి ప్రవీణ్, కంకనాల శ్రీనివాస్ తోడేటి నర్సవ్వ, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్లకు రూ. 18 వేల పారితోషకం ఇవ్వాలి



వైద్యులకు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

**శివ్వంపేట, సెప్టెంబర్5 ప్రభాతవార్త:** ఆశావర్కర్లు చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, రిజిష్టర్లు రాయడం, సర్వేలుచేయడం, అసైన్డ్ పని చేయడం, బిపీ, థైరాయిడ్, షుగర్ తదితర జబ్బులను గుర్తిస్తున్నారని ఆశావర్కర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోపమ్మ, రేణుకలు అన్నారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశావర్కర్లకు పనిభాగం విపరీతంగా పెరిగిందని, పారితోషకంతో పాటు అనేక పనులను ప్రభుత్వం ఆశాలతో చేయిస్తుందని అన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సబ్ సెంటర్స్, బస్తీ దవఖానాల్లో పని చేస్తున్నారని వారు అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వారి సేవలను గుర్తించి తాము డిమాండ్ చేస్తున్న 18 వేల రూపాయల పారితోషకం అమలుచేయాలని వారు అన్నారు. అంతకు ముందు ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించి ప్రభుత్వ వైద్యులు సాయిసౌమ్య, సంధ్యలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సబిత, లక్ష్మీ, వెంకటమ్మ, అనసూయ, మాధవి, శ్యామల, స్వరూప, పద్మ, మంజుల, షాహీనా, మమత, స్వప్న, వివిధ గ్రామాల్లో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**కొల్చారం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ అన్నారు. మంగళవారం కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టు నుండి నీటిని వదలడంతో మంజీరా పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నఘనపూర్ శివారులోని ఘనపూర్ ఆనకట్ట వద్దకు పర్యాటకులు ఎవరూ వెళ్లరాదన్నారు. పోతంశెట్టిపల్లి, కొంగోడ్ శివారులోని వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది కాబట్టి ఆ దారిలో వెళ్లే ప్రజలు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, విద్యుత్ మరమ్మత్తులకు సంబంధించిన పనులను అనుభవం కలిగిన వారితోనే చేయించుకోవాలని సూచించారు.



టేక్మాల్‌లో నేత్రదాన పకోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## టేక్మాల్‌లో నేత్రదాన పక్షోత్సవాలు

**టేక్మాల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని టేక్మాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్తలిమిక్ అధికారి శ్యామ్, హెల్త్ ఎక్స్టెన్షన్ అధికారి సుగుణకర్ మాట్లాడుతూ నేత్రదానం చిరంజీవులుగా ప్రతికి ఉందాం అన్నారు. మనిషి చనిపోయిన 6 గంటల లోపు నేత్రదానం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ ఎన్.వసంత సిబ్బంది సంగమేశ్వర్, మోహీజ్, సాయిబాబాలతో పాటు తదితరులున్నారు.

## కురిసిన వర్షం-ఆనందంలో రైతాంగం



రైతులు సాగు చేస్తున్న పత్తి పంట దృశ్యం

**న్యాల్‌కల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు సాగుచేస్తున్న పంటలకు (సోయ, పత్తి, మినుము, పెసర) వర్షాల కోసం మేఘాలవైపు నెలరోజులుగా ఎదురుచూస్తూ ఉండగా వరుణుడు కరుణించడంతో రెండు రోజులుగా వర్షాలు కురిసాయి. రైతులు ఆశించిన మేరకు వర్షాలు కురివడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. మండలంలో కురిసిన వర్షాపాతాన్ని పరిశీలిస్తే జూన్‌లో సాధారణ వర్షపాతం 119.6గా 165.2 మి.మిటీర్ల వర్షం, జులైలో 185.03 మిమిటలకుగాను 360 మి.మి వర్షం, ఆగస్టులో 178 మిమి సాధారణ వర్షపాతం కాగా 169 మిమి మీటర్ల వర్షం కురిసింది. అయితే సెప్టెంబరులో 4, 5వ తేదీల లో 62.4, 55.2 మిమి వర్షం కురిసినట్లు రెవిన్యూ రికార్డులు ధృవీకరిస్తున్నాయి. పంటలసాగుకు అవసరమైన మేరకు వర్షాలు కురివడంతో రైతులు ఈ ఏడాదిలో తొలి మారు ఆనందంతో పంటలను సాగు చేసుకుంటున్నారని చెప్పవచ్చు. కాగా పొలాల్లో నిలబడిన నీటికి తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

## దళితులందరికి దళితబంధు అందించాలి



ఎంపిడిఓ ముజఫరోద్దీన్‌కు వినతి పత్రం అందచేస్తున్న దళితులు

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కంగ్టి మండలంలోని దళితులందరికి దళితబంధుపథకాన్ని అందించి ఆర్థికంగా స్థిరపడేలా చూడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంపిడిఓ ముజాఫరోద్దీన్‌కు దళితులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్బంగా వైఎస్సార్‌టిపి నియోజకవర్గ ఇంచార్జి బోర్గి సంజీవ్, బిఎస్‌పి ఇంచార్జి బాబు, కాళే రాజు, లక్ష్మన్ మాట్లాడుతూ పేద దళితుల సంక్షేమానికి అమలు చేస్తున్నామంటున్న దళిత బంధు కొందరికి అమలు చేస్తే ఎలా అని దళితులందరికి పథకం అమలు చేస్తూ దళితులందరూ అభివృద్ధి చెందుతారన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత బంధును ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కాకుండా అధికారులచే పంపిణి చేయాలని హితువు పలికారు. ప్రతి దళితుడికి దళితబంధు అందించకుంటే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

## వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టండి : ఎమ్మెల్యే



వరద పరిస్థితిపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మూడు రోజులుగా నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన ప్రాంతాలలో సహాయక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సూచించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో (రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్) వరద పరిస్థితిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా పట్టణంలో నీటమునిగిన కాలనీల్లో తీసుకున్న జాగ్రత్తలపై అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అధికారులు జాగ్రత్తగా ఉండాలని, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వరద నీరు కాలనీల్లో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకారెడ్డి, మున్సిపల్ కమీషనర్ మల్లారెడ్డి, విద్యుత్ డిఈ లక్ష్మీనారాయణ, ఏఈ ప్రవీణ్, ఇరిగేషన్ ఏఈ, తహసీల్దార్ ఎస్ రవీందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే ఏడుపాయల అభివృద్ధి

### -మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

ఏడుపాయల వనదుర్గాభవాని మాత అమ్మవారి ఆలయం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషితో తాను ఎమ్మెల్యే ఉన్న తరుణంలో ఏడుపాయల అభివృద్ధి బాటలో పయనించిందన్నారు. ఏడుపాయల జాతరను రాష్ట్ర ఉత్సవ జాతరగా ప్రకటించిన విషయాన్ని శశిధర్‌రెడ్డి గుర్తు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు వేసిన నీరు లభ్యం కాకపోవడంతో శాశ్వత పరిష్కారానికి ఇపిడబ్ల్యూఎస్ పథకంలో 3 కోట్ల రూపాయలతో మంజీర నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ వేసి 8 ట్యాంకులను నిర్మించామన్నారు. ఏడుపాయల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలన్న సంకల్పంతో అప్పటి విద్యుత్ శాఖ మంత్రి షబ్బీర్ అలీ సహకారంతో ఎక్స్‌ప్రెస్ లైన్ వేయించామన్నారు. ఏడుపాయల కమాన్ నుంచి ఆలయ వరకు 7 కోట్లతో సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు చేయించామన్నారు. ఇండియన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేంద్ర ప్రభుత్వం 3 కోట్ల రూపాయలను హరిత రెస్టారెంట్‌ను మంజూరు చేయించామన్నారు. మాజీ మంత్రి డాక్టర్ జెట్టి గీతారెడ్డి సహకారంతో రాష్ట్ర పర్యాటక శాఖ 1.50 కోట్ల నిధులతో యాత్రికులకు అతిథి గృహాలను నిర్మించామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోషయ్య సహకారంతో 40 కోట్ల రూపాయలతో పోతంషెట్‌పల్లి నుంచి ఏడుపాయల రోడ్డు, వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. ఏడుపాయల అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాత్ర ఏమిటని శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. నిజం షుగర్ కర్మాగారాన్ని తెరిపించడంతో తెలంగాణ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు.

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### కంగ్టి మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**కంగ్టి, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**
గ్రామాల్లో నెలకొన్న సమస్యలను (తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర) వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కంగ్టి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షురాలు సంగీత వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 52 గ్రామాలకు తాగునీటి సరఫరా నిరంతరంగా సాగుతోందని అధికారులు తెలిపారు. జంబ్గి గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఏఈ శోభారాణికి ఎమ్మెల్యే సూచించారు. ఎడ్ల రేగడి తండాకు 3ఫేస్ కరెంటును సరఫరా చేయాలని సర్పంచ్ బలిరామ్ సభలో డిమాండ్ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు ఓవర్‌లోడ్ అయితే డిడిలె చెల్లిస్తే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీఇచ్చారు. కంగ్టి, తడ్కల్‌లకు 100 కెవిలను ఏర్పాటు చేశామని 2 కోట్ల 11 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలను సభ్యులు సభ దృష్టికి తేగా సమస్య పరిష్కారానికి తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ఉపాధ్యక్షులు రేఖాపాటిల్ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కోట ఆంజనేయులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఓ ముజాఫరోద్దీన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## గురువును మించిన దైవం లేదు : ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

**రామాయంపేట, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** గురువును మించిన దైవం లేదని రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఆంజనేయులు అన్నారు. కళాశాలలో ఏర్పాటుచేసిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడుతూ గురువు లేకపోతే ఏ విద్య ముందుకు వెళ్లదన్నారు. విద్యార్థులు విద్యను అభ్యసించడానికి వచ్చినప్పుడు గురువులకు గౌరవం పూజ్య భావంతో నేర్చుకోవాలని ఆయన కోరారు. దేశ మొదటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ఉపాధ్యాయులుగా పనిచేసి రాష్ట్రపతిగా ఎదగడమే కాకుండా విద్యార్థులను ఎంతో తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచారి, బాబురావు స్వామి,సురేష్ గౌడ్, బాల ప్రకాష్,మస్తాన్వలి, సురేందర్, శ్రీశైలం, యాదగిరి, మంగ శ్రీదేవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## నర్సాపూర్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న రమేశ్‌గౌడ్



నర్సాపూర్ బిజెపి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం దరఖాస్తున్న చేస్తున్న రమేశ్‌గౌడ్

**మెదక్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** బిజెపి కార్యాలయంలో మంగళ వారం నర్సాపూర్ పట్టణానికి చెందిన ఆ పార్టీ ఓబిసి జిల్లా అధ్యక్షులు పాప గారి రమేశ్‌గౌడ్ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు.హైద్రాబాద్‌లోని నాంపల్లిలోగల బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఓబిసి మెదక్ జిల్లా అధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్‌తో పాటు పలువురు బిజెపి నాయకులతో కలిసి హైద్రాబాద్‌కు వెళ్లి తనకు నర్సాపూర్ నియోజక వర్గం నుండి బిజెపి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు టికెట్టును ఇవ్వాల్సిందిగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి ఎమ్మెల్యే టికెట్టు తనకే కేటాయించాలని పాపగారి రమేశ్‌గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల బిజెపి అధ్యక్షులు పాతురి దయాకర్‌గౌడ్, మెదక్ జిల్లా బిజెపి నాయకులు రాంసాన్‌పల్లి అంజాగౌడ్, కొల్చారం మండల బిజెవైఎం అధ్యక్షులు పంతులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మాణిక్‌ప్రభు పాఠశాలలో ఘనంగా టీచర్స్ డే

**జహీరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందచేశారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్రపై ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య వివరించారు. పాఠశాలలోని ఉపాధ్యాయు లను ఈసందర్బంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, నాగలక్ష్మి, కల్పన, అనిత, సువర్ణ, రాజేశ్వరి, స్వరూప, శివశంకర్, మధు, పాల్గొన్నారు.

## సన్మానం అందుకున్న వినయ పాటిల్



సన్మానం అందుకుంటున్న ఉత్తమ ఉపాధ్యాయురాలు వినయపాటిల్

**జహీరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన వినయపాటిల్ (ఝరాసంగం మండలం బోపన్‌పల్లి పాఠశాల) మంగళవారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖులతో సన్మానం అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి, డిఈఓ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయురాలు వినయపాటిల్ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం పట్ల ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉపాధ్యాయురాలిని సన్మానించిన విద్యార్థులు

**చౌటకూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొమ్మరెడ్డి గూడెం తండాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయురాలికి విద్యార్థులు సత్కరించారు.కార్యక్రమంలో ఆశ్రమపాఠశాల ప్రధానోపాధ్యాయులు రాందాస్, ఉపాధ్యాయులు మురళిగౌడ్ జోగినాథ్, అంజయ్య, స్వప్న పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో 11వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు...

**అల్లాదుర్గం, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** అల్లాదుర్గంను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మంగళవారంతో నిరాహారదీక్షలు 11వ రోజుకు చేరుకున్నాయి. గడిపెద్దాపూర్ గ్రామ బిజెపి యువజన అధ్యక్షులు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు గోపాల్, కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు వెంకట్,మహేష్, రాజు, నవీన్, వెంకటేష్, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు. అల్లాదుర్గంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, వంద పడకల 24 గంటల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కోర్టు, బీసీ గురుకుల పాఠశాల, ఎస్‌టిఓ కార్యాలయంను వెంటనే ప్రారంభించాలని అన్నారు. వీరికి సంఘీభావంగా వట్టిపల్లి మండల లంబాడి హక్కు పోరాట సమితి అధ్యక్షులు సుభాష్, సభ్యులు హరి, అబ్బాస్, రమేష్, శ్రీనివాస్, జేఏసీ నాయకులు కంచరి బ్రహ్మం, సంగయ్య, దుర్గయ్య కలిసి సంఘీభావం ప్రకటించారు.



ఎమ్మెల్యే మదన్‌రెడ్డికే టికెట ఇవ్వాలంటూ కోరుతున్న బిఆర్ఎస్ నేతలు

## నర్సాపూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరుతున్న ప్రచారం అవాస్తవం

**కౌడిపల్లి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా టిక్కెట్ ఖరారు చేయకుండా అధిష్ఠానం జాప్యం చేస్తున్నందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ఆవాస్తవమని బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్ అధ్యక్షతన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో రామాగౌడు మాట్లాడుతూ మదన్‌రెడ్డి సిఎం కేసిఆర్‌కు నమ్మిన బంటుగా ఉంటాడే తప్ప వెన్నుపోటు పొడిచే నైజం లేదన్నారు. గడిచిన 9 ఏళ్లలో నియోజకవర్గ అభివృద్ధికోకృషి చేసిన వ్యక్తి మదన్‌రెడ్డి అని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ నుండి నర్సాపూర్ నియోజక వర్గం నుండి ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని మూడోసారి గెలిపించి హాట్రిక్ సాధిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు చంద్రం క్రిష్టాగౌడు, ఎంపిపి రాజు నాయక్, వైస్ఎంపిపి నవీన్ గుప్తా, మాజీవైస్ఎంపిపి సున్నం సతీస్, మహమ్మద్ నగర్ సొసైటీ వైస్ చైర్మెన్ చిలుముల చిన్న చిన్నం రెడ్డి, కాలేరు శివాంజనేయులు, నాయికోటి శ్యాం సుందర్‌రావు, కాంతరావు, పెద్దసాయి రెడ్డి, కుర్మ శేఖులు, నరహరీ, జిల్లా ఆర్యవైశ్ సంఘం నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా, దుర్గారెడ్డి, మహిపాల్ రెడ్డి, సర్దార్, బాల్‌లింగం, లక్యా, దుద్యా, ఎంపిటీసి శివకుమార్ యాదవ్, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటీసిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు హుక్రానాజీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రాజు, బుతపిల్లి మహేష్, బేగరి మానయ్య, బేగరి శంకర్, బేగరి నర్సింలు, బుతపిల్లి సాయిలు,శివకుమార్, బీమయ్య, మనోజ్‌కుమార్, నవేద్, విఠల్, నర్సింలు, సుమారు 100 మంది వరకు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు నవాబ్ భారస కార్యకర్తలు ఉన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది: ఎమ్మెల్యే

**సంగారెడ్డి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల వృత్తి ఎంతో గొప్పదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ ఎంపీపీ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో 69 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించి మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలల్లో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులే ఎక్కువగా చదవుకుంటారన్నారు. వివిధ రంగాల్లో ఈ ప్రాంతం విద్యార్థులు అన్ని ఉద్యోగాల్లో పోటీ పడి ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఖేడ్ ప్రాంతంలో బీద బడుగు వర్గాల కోసం గురుకుల పాఠశాలలను కూడా నేలకొల్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు కర్ర చాందీబాయి, జడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, మున్సిపల్ ఛైర్మన్ రుబీనా నజీబ్, ఎంపీపీ తనయుడు రమేష్‌చౌహాన్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్లు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# మినీ ట్యాంక్‌లో గంగమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మిని ట్యాంక్ బండ్‌లో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి

**కౌడిపల్లి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:**
మంగళవారం కౌడిపల్లి మినీ ట్యాంక్ బండ్ ఎనిమిదేళ్ల తర్వాత అలుగు పారుతున్న దృశ్యాలను ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి తిలకించి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు కోలచల రాజేశ్వర్‌శర్మ, కోలచల సుమన్‌శర్మ చెరువుకట్టపై ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి గంగమ్మతల్లి, కట్టమైసమ్మ తల్లికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని చెరువులు ఎనిమిదేళ్ల క్రితం పొంగాయని, ఆ తర్వాత నేడు కౌడిపల్లి చెరువు అలుగు పొంగడం జరిగిందన్నారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు కౌడిపల్లి పెద్ద చెరువు నిండి అలుగుపారుతున్నందున త్వరలోనే మత్స్యకారుల అభ్యున్నతికి చెప పిల్లలను వదలటానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపాటు ఎంపిపి రాజు నాయక్, వైస్ఎంపిపి బోడ్ల నవీన్‌గుప్తా, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సార రామాగౌడు, మహమ్మద్ నగర్ సొసైటీ వైస్‌చైర్మెన్ చిలుముల చిన్న చిన్నం రెడ్డి, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు చంద్రం క్రిష్టాగౌడు, జిల్లా ఆర్యవైశ్ సంఘం నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా, టిఆర్ఎస్ నాయకులు చిలుముల దుర్గారెడ్డి,నవీన్‌రావు, నాయికోటి శ్యాంసుందర్‌రావు, కాంతరావు, కాలేరు శివాంజనేయులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు భుజిరంపేట మల్లేశం, కారోబార్ ఎల్లం, కౌడిపల్లి పంచాయతీ వార్డు సభ్యులు, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసిలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**మునిపల్లి, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారిని సంగారెడ్డిలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో జిల్లా కలెక్టర్ శరత్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయులు గోపాల్(ఖమ్మంపల్లి), మధురిమ(మునిపల్లి), సత్యవాణి(పెద్దగోపులారం), రమాదేవి(మోడల్ స్కూల్), సృజనకుమారి(మల్లికార్జున్‌పల్లి), సుధాకర్(పెద్దగోపులారం), సయ్యద్‌ఫరూఖ్ ఆహ్మద్(కంకోల్), యూనుస్(లింగంపల్లి)లను శాలువాలు కప్పి జ్ఞాపికలను అందచేసి అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయులను టీపిటిఎఫ్ అధ్యక్షులు నీలి లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి పిరంగుల గోపాల్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

**మండలంలో నలుగురు ఉపాధ్యాయులకు...**



సంగారెడ్డిలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, ఓంకార్‌స్వామి, గణేశ్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయులు మురళీధర్, మామిడ్గి పాఠశాల ఉపాధ్యాయులు విజయకుమార్‌లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పుష్కరించుకుని సంగారెడ్డి పట్టణంలో నిర్వహించి కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాల కప్పి జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పట్లోళ్ల నరహరిరెడ్డి, డిఈఓ తదితరులు పాల్గొన్నారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు...**



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చైర్మన్ చింత ప్రభాకర్

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన పి.శోభారాణిని మంగళవారం సంగారెడ్డిపట్టణంలో ఘనంగా సన్మానించారు. శోభారాణిని మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శాలువా కప్పి ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో డిఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, రెవిన్యూ అధికారి మెంచు నగేష్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీచర్స్ డే



సర్వేపల్లికి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టిలోని లిటిల్‌స్టార్ స్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. సర్వేపల్లి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అందుకున్న బిరుదులను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు చంద్రకాంత్ గౌడ్, సుధీర్, నరేష్, అనిల్, అశోక్, పోలీస్ కానిస్టేబుల్ జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**చేర్యాల, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పరిధిలోని తూర్పు గుంటూరుపల్లికి చెందిన పల్లా తులసమ్మ(60) కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది.కాగా ఆమె దహన సంస్కారాలకు ఆర్థిక స్తోమత లేక బాధపడుతున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగలో చంటి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి దృష్టికి తీసుకపోవడంతో రూ.10వేలు అందించినట్లు చంటి తెలిపారు. అనంతరం మృతదేహంపై చంటి పూలమాల వేసి నివాళులర్పించారు.

## మల్లెపల్లి గ్రామ పంచాయతీకి వైకుంఠరథం అందజేత

**కొండాపూర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్లెపల్లి గ్రామ పంచాయతీకి ఆయిల్‌రెడ్డి భూపాల్‌రెడ్డి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం మంగళవారం వైకుంఠరథాన్ని బహుకరించారు. గ్రామంలో మృతి చెందిన వారిని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులు గమనించి వెంటనే వైకుంఠరథాన్ని అందచేసినట్లు భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలీల జగదీశ్వర్, ఉప సర్పంచ్ రామప్ప, జడ్పీటిసి సభ్యులు పద్మావతిపాండురంగం, ఎంపిటిసి రాందాస్, నాయకులు ఆయిల్ రెడ్డి నరసింహారెడ్డి, గౌతంరెడ్డి, బలవంత్‌రెడ్డి, శివరాజ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సురేష్, రవి, సునీల్, పంచాయితీ కార్యదర్శి కటకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** సీఎం సహాయనిధి పేదలకు అండగా ఉంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు. నారాయణఖేడ్ మండలం హుక్రానాజీ గ్రామానికి చెందిన రాంరెడ్డి కుమారుడు బసిరెడ్డికి ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తం రూ.లక్ష, హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన సిద్దయ్యస్వామి భార్య శోభకు చికిత్స నిమిత్తం రూ.35000 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బారస నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పిన బైక్-వ్యక్తి మృతి

**పాపన్నపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొడుపాకలో మంగళ వారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఆరిగే సాయిలు (40) మత్స్యకారుడిగా జీవనం సాగిస్తున్నాడన్నారు. సోమవారం ఉదయం బసన్నకుంటలో చేపలు వేటాడి పట్టుకున్న చేపలను అమ్ముకునేందుకు టివిఎస్ మోటారు సైకిల్‌పై ఏడుపాయల కమాన్ వైపు వెళుతున్న తరుణంలో సైకిల్ మోటారు అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. ప్రమాదాన్ని గమనించి స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్యమధ్యలో మృతి చెందాడన్నారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి వివరించారు.